

# టేకిట్ ఈజీ!! - 3

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





# పద్దెనిమిది కాయల నోము

**"ఏంటోరా, అసలీమజ్జెన ఏవీ బాగోటంలేదు"** అన్నాను నందు గాడితో.

వాడు అప్పటికే ఐదో గ్లాసుమీదున్నాడు. **"నిజవేరా, క్వాలిటీ బొత్తిగా పడిపోయింది. ఈ షారి బిరియానీ పాయింట్ నించి షఛ్చినా ఆర్డర్ చెయ్యద్దు"** అన్నాడు, బిరియానీ తిన్న ప్లేటు అవతల పారేస్తూ.

వీడితో లాభంలేదని, ఇటు పక్కన కూర్చున్న రాజుగాడితో అన్నాను **"ఏంటోరా, ఈ మజ్జెన అసలు ఏవీ బాగోట్లేదు"** అని.

వాడు లేచి నిలబడి, అరగంట దేన్ని స్టెప్పులేసి, శరీరానికి అతుక్కుపోయిన జీన్స్ పేంట్ లోంచి అతి కష్టం మీద ఓ సిగార్ తీసి, **"ఇది ట్రై చెయ్యరా, అద్దిరిపోద్ది. మొన్న మా తాత తద్దినానికి, ఆయన ఫొటో ముందు పెడితే, రెండునిమిషాల్లో మాయవైపోయాయి. అంత పవర్ఫుల్. సేం టు సేం మన లంక పొగాకే.."** అన్నాడు తృప్తిగా.

ఇంక వీళ్ళతో నా గోడు చెప్పుకోవడం కన్నా, గోడకి చెప్పుకోవడం నయమనిపించింది. గోడకేసి తిరిగి మొదలెట్టాను.

**"ఏంటోరా.."** అంటూ.

ఇంతలో వెంకటొచ్చి వెనకనించి భుజం మీద చెయ్యేసి, **"బెదరూ, నాతో చెప్పు, నీకొచ్చిన కాష్ఠం ఏమిటి?"** అన్నాడు పెండ్యులం లాగ ఊగుతూ.

**"కాష్ఠం కాదురా బాబూ, కష్టం అనాలి. ఇంతకీ చెప్పొచ్చే దేవిటంటే, ఎదుగూ బొదుగూ లేని జీతం, ఎక్సైట్మెంట్ లేని జీవితం, పట్టించుకోని పెళ్ళాం, మాట వినని పిల్లలూ. ఏంచేయమంటావురా?"** అన్నాను ఆందోళనగా.

**"వోస్సిడేనా, డీనికి ఇంటల్లా వర్రీ అవుటావేంటి? ఒక్క పెళ్ళాం పాయింటు ఒడిలేస్తే, తతిమ్మా వాటికి రెమెడీ వుంది. వుండిప్పుడే వొస్తా..."** అని పైకెళ్ళి గెంటల పంచాంగం లేటెస్ట్ వెర్షన్ పట్టుకొచ్చాడు.

**"ఇదేట్రా, ఉపాయం చెప్పడానిక్కూడా ముహూర్తం చూడాలారా?"** అన్నాను ఏడుపుమొహవెట్టి.

**"యెహె, అదికాద్రా, పద్దెనిమిదో పేజీ చూడు.."** అన్నాడు మళ్ళీ పెండ్యులంలాగే వూగుతూ.

నేను ఎంతో ఆత్రుతగా పేజీలు తిప్పాను. 15, 16, 19,20...**"అరె, ఇదేటి, పద్దెనిమిదో పేజీ ఎవరో చింపేసారు.."**అన్నాను బెంగగా.

వెంటనే నందు గాడొచ్చి **"ఏంటి పద్దెనిమిదో పేజీ కనబడట్లేదా?"** అన్నాడు ఎంక్వరీ ఫేసుతో.

నాకనుమానంవచ్చి **"రేయ్, నందు గా, నీకేవన్నా తెలుసా? నిజం చెప్పు."**అని వాడి పీకట్టుకున్నాను.

వాడు ఒక్క సారి నోరు తెరిచాడు. ఆవాసనకి నేను ఎగిరెళ్ళి గోడకి గుద్దుకుని కింద పడ్డాను.

**"నాకేం తెలుసు, అంటే నాకేం తెలీదు. ఎవరు చింపేసారో ఏమో.."** అనేసాడు దొంగ చూపులు చూస్తూ.

నాకనుమానం ఎక్కువైంది. కానీ చేసేదేం లేక వెంకట్ కేసి తిరిగి **"సర్లే బెదరూ, నేను ఇండియాకి ఫోను చేసి తెప్పించుకుంటాను."** అనేసి, నా డెసిగ్నేటెడ్ డ్రైవర్ పోష్టు కి రాజీనామా చేసేసి, ఇంటికొచ్చేసాను.

సమయం రాత్రి రెండున్నర. మామూలుగానే ఎవ్వరూ మనని పట్టించుకోలేదు. లోపలికొచ్చి ఇంటికి ఫోను చేసాను. అమ్మ ఫోనెత్తింది.

**"అమ్మా. ఏంటోనే, అసలీ మజ్జెన"** అని మొదలెట్టి, సోదంతా చెప్పాను.

అమ్మ అంతా విని, "**ఉండు నాన్నని పిలుస్తా**" అనేసి,

"**ఏవండీ, ఓ మాటా గంటల పంచాంగం ఇలా పట్రండి..**" అని కేకేసింది.

నాన్న వచ్చారు. పద్దెనిమిదో పేజీ తీసి చూడమన్నాను. చూసారు. ఏవుందో చదవమన్నాను. చదివారు.

*మగవాళ్ళంతా చక్కగా కళకళలాడుతూ,* ***భోగ భాగ్యాలతో, పాడి పంటలతో, ఉండమ్మా బొట్టు పెడతాలతో, శంకు తీర్థాలతో, ఈనాటి ఈబంధం ఏనాటిదో*** *తో,* ***హేమా హేమీలలాగా*** *బతుకుతూ,* ***జమదగ్నిలా అగ్నిపర్వతాలు*** *సైతం బద్దలు కొట్టే* ***శక్తి*** *సంపాదించుకోవాలంటే (వీడెవడో సూపర్ స్టార్ ఫేన్ లా వున్నాడు) చేయవలసిన వ్రతం ఒకటుంది. అదే పద్దెనిమిది కాయల వ్రతం. అతి గుహ్యమైన ఈ వ్రతాన్ని.."* అంటూ నాన్న చదువుతూవుంటే మాటకి అడ్డొచ్చి,

"**నాన్నా, గుహ్యం అంటే ఏవిటండీ?**" అన్నాను బాలుడిలా.

"**ఏహె, ఫ్లో కి అడ్డం రాకు. నాకుమాత్రం ఏం తెలుసు, ఏదో గుహ అయ్యుంటుంది. సర్లే, విను..**" అని కంటిన్యూ చేసారు.

అతి గుహ్యమైన ఈ వ్రతాన్ని తొల్లి నారదులవారు జంభాల మునికి చెప్పెను. *(ఇక్కడ "తొల్లి" అంటే ఏంటో అడుగుదామనుకున్నాను గానీ, మళ్ళీ ఫ్లో కి అడ్డొస్తే, నాన్న తిడతారని నోరుమూసుకున్నాను. బహుశా ఏదో "బల్లి" అయ్యుంటుంది.)* జంభాలముని ఈ వ్రతాన్ని ఆచరించి విశేషమైన ఫలములు బడసెను.

"**నాన్నా, ఫలాలంటే పళ్ళు కదా, అంటే కాయల వ్రతం చేస్తే, పళ్ళొస్తాయా**" అన్నాను హాశ్చర్యంగా.

ఆయన ఫోనుని ఓసారి చెప్పుతో కొట్టి, మళ్ళీ మొదలెట్టారు.

ఒకసారి అరణ్యవాసంలో వున్న పాండవులు జంభాల ముని ఆశ్రమంలో సేదదీరినప్పుడు, ఊసుపోక ఆయన ఈ వ్రతాన్ని వారికి వివరించెను. వారు ఎలాగూ ఖాళీయే కాబట్టి, ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరించి, ఆనక కొన్ని రోజులు పోయకా, తమ రాజ్యమును, వైభవమును తిరిగి పొందిరి. అదే విధముగా కలియుగములో, తొల్లి (?) భరత మహారాజుగారు ఈ వ్రతాన్ని ఆచరించి, మన దేశానికి భారత దేశము అని నామకరణం చేసి, పిమ్మట అక్షరాభ్యాసం చేసి, స్కూలుకి పంపి, ఎన్నెన్నో బడసిరి. ఆనక సూపర్ స్టార్ గారు ఆచరించి, తమ సినిమాలన్నీ హిట్లు చేసుకొనిరి. నెంబర్ వన్ అనిపించుకొనిరి. *(ఈ వ్రత విధానము రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్ లో క్లుప్తముగా వివరింపబడినది. తప్పక చూడుడు).* ఆమట్నించి, మొన్నటికి మొన్న చైనులుగారు ఈ వ్రతాన్ని ఆచరించి, ఆస్థాన పండితుడి పదవి పొందిరి. ఆయన మా బాబయ్య గారు. కావున ఈ వ్రతము ప్రతి పురుషుడూ ఆచరింపతగినది.

<u>వ్రత విధానము:</u> ఈ వ్రతము చేయువారు పెందలకడనే లేచి, అభ్యంగన స్నానం చేసి, పైజామా గానీ, పంచె గానీ కట్టుకుని, 108 సార్లు కూరగాయల మాత అష్టోత్తరం చదువుకోవాలి. అదయ్యాకా, కాఫీ తాగచ్చు. ఆరోజంతా వీరు పులుపు, తీపి, ఉప్పు, చేదు, వగరు, ఖారం, చప్ప, తప్ప మిగిలిన రుచులన్నీ రుచిచూడవచ్చును. ఇలా సాయంత్రం వరకూ వుండి, సాయంత్రం ఆకాశంలో చుక్క వచ్చాకా, చూసి దణ్ణవెట్టుకుని, నిఖార్సయిన 18 మంది మగ ముత్తైదువలని పిలిచి, 18 రకాల కాయలు, రకానికి పద్దెనిమిది చొప్పున వాయనం ఇవ్వాలి. ఒక్కోరికీ ఒక్కోరకం ఇవ్వాలి. ఇలా చేసిన తరువాత, ఆనక **చైనులు గారి అన్న కొడుకుకి కరెక్ట్ సైజులో వున్న బంగారు గోవు ఒకటి దానం ఇవ్వాలి. ఈ దానం ఇవ్వకపోతే వ్రతం ఫలితాన్ని ఇవ్వదు. బెడిసికొడుతుంది. ఆనక మీ ఇష్టం.**

<u>ఈ వ్రతానికి కావలసిన కూరలు :</u> అన్నిటికంటే ముఖ్యంగా కావలసినవి పోక్కాయలు. 18 పోక్కాయలు పళ్ళెంలో పెట్టుకోవాలి. పిమ్మట ఆనప, చిక్కుడు, వంకాయ, ఇలా మీ శక్తి కొలది, మిగిలిన పదిహేడు కూరలు సమకూర్చుకోండి. ఈ వ్రతం చేసుకుని, దానం ఇచ్చి, ఆనక చెలరేగిపొండి. సర్వం "కృష్ణార్పణం". "

నాన్న చదవడం పూర్తైంది. నాకు శోష వచ్చింది.

"**ఇదంతా అయ్యేపనికాదు నాన్నా, బంగారం గోవు, అదీ లైఫ్ సైజు అంటే కష్టం కదా నాన్నా..**" అన్నాను బెంగగా.

"**కష్టం అంటే ఎలారా? మేమంతా చేసుకోలేదూ? ప్రతీ దానికీ అమెండ్మెంట్లున్నాయి. సిద్ధాంతిగారి దెగ్గిరే ఓ బంగారం గోవుంది. దాన్ని ఓ గంటకి అద్దెకి తీసుకుని, ఆయనకే ఇచ్చేయచ్చు. రేటు 50 వేలు. ఇంక నువ్వక్కడ వ్రతం కానీ. మిగితాది ఇక్కడ నేను చూసుకుంటాను.**" అనేసి ఫోను పెట్టేసారు.

నేను ఆ మర్నాడు గురువారం నాడు కూరలకొట్లోకెళ్ళాను. వోక్కాయలున్నాయా అని అడిగాను. ఇప్పుడే ఎవరో నందు గారట వచ్చి నాలుగు బస్తాలు కొనుక్కెళ్ళారు. ఇంకా మాదగ్గిర లేవు అంది కౌంటర్లో పెద్దావిడ. వెంటనే నందుగాడికి ఫోను కొట్టాను. విధి లేక ఒక్కో వోక్కాయ నాలుగు డాలర్లకి కొన్నాను వాడి దగ్గిర. అలాగే మిగితా కూరలన్నీ సమకూర్చుకుని, ఆ మర్నాడు పెందలకడనే 10:30 కి లేచి, కాఫీ తాగి, 108 సార్లు అష్టోత్తరం చేసేసరికి చీకటడిపోయి చుక్కొచ్చేసింది. ఆనక నందు గాడొచ్చేసాడు. మిగితా 17 మందీ నెక్స్ట్ వీక్ వస్తామన్నారు. వాడికి ఫేసుకి ఫెయిరు మరియు లవ్లీ రాసి, కాళ్ళకి పసుపు రాసి, పెద్ద పళ్ళెంలో ముందుగా వోక్కాయలిచ్చి మొదలెట్టాను.

**"ఇస్తినయ్యా వాయనం"**

**"పుచ్చుకుంటినయ్య వాయనం"**

**"నా చేతివాయనం ఎవరయ్యా పుచ్చుకుంటున్నది?"**

**"నేను తాతా సోవన్నతాత మనవణ్ణి."**

**"నాకెవరయ్యా ఈ వాయనం ఇస్తున్నది?"**

**"నేను ఉపాజ్జేయుల కిట్టమూత్తి బావ మనవణ్ణి"**

ఇక్కడ కిరణ్ ప్రభ గారు ప్రత్యక్షమయ్యారు **"కట్, కట్.."** అంటూ.

**"ఏంటి సార్, ఏమైంది?"** అన్నాను ఆందోళనగా.

**"ఇంటిపేర్లు గట్రా రాయద్దు సార్. అక్కడ "బీప్" వెయ్యండి"** అన్నారు సాలోచనగా.

**"అదికాద్సార్, అంతా మనోళ్ళేకదా అని అలా రాసానన్నమాట. సర్లెండి, మళ్ళీ బీప్ వేసి రాస్తాను."** అనేసి మళ్ళీ మొదలెట్టాను.

**"నా చేతి వాయనం ఎవరయ్యా తీసుకునేది?"**

**"నేను బీప్ తాత మనవణ్ణి"**

**"నాకెవరయ్యా ఈ వాయనం ఇస్తున్నది?"**

**"నేను బీప్ బావ మనవణ్ణి"**

**"అరే, మీ తాతపేరు బీపా? మా తాతపేరు కూడా బీపే"** అన్నాడు నందు గాడు అమితానందంగా.

**"అవున్రా, నాకిన్నాళ్ళూ తెలీదు. అయితే మనం తాతా సహోదరులమా?"** అన్నాను విఠలా చార్య సినిమాలో కాంతారావులాగ.

**"కరెక్ట్రా. చూసావా ఈ వ్రతం చేసుకోవడం వల్ల ఏనాడో తప్పిపోయిన తాతా సోదరుడు దొరికాడు."**అన్నాడు పట్టలేని ఆనందంతో కౌగలించేసుకుంటూ.

**"మీ పిచ్చి మండ, మిమ్మల్ని ఎవ్వడూ బాగు చెయ్యలేడు, గోదాట్లో దూకండి. నాకవతల బోల్డు పనులున్నాయి"** అనేసి మాయమై పోయారు కిరణ్ ప్రభ గారు.

నేను నందుగాణ్ణి సాగనంపి, మెయిల్ బాక్సు ఓపెన్ చేసాను. దానిలో మావాడు ఇయర్లీ బోనస్ గా నాలుగు పిజ్జా క్యూపన్లు పంపించాడు. నేను ఆనందం పట్టలేక, **"వ్రతమహిమ"** అని మాయాబజార్ లో గుమ్మడి గారిలాగ ఉప్పొంగిపోతూ లోపలికొచ్చా.

**"నాన్నా, వీణ క్లాసుకి టైమైంది, ఎంతసేపు వెయిట్ చెయ్యాలి నీకోసం?"** అంది పెద్ద శాల్తీ.

**"ఆ, నాకోసం పిల్లలు వెయిట్ చెయ్యడమా ! అంటే నన్ను పట్టించుకుంటున్నట్టేగా..వ్రతమహిమ.."** అని ఇంకోసారి ఉప్పొంగిపోయి, ఆనక బుద్ధిగా మళ్ళీ డ్రైవర్ డ్యూటీ డ్యూటీ ఎక్కి దాన్ని క్లాసులో దింపొచ్చేసాను. వచ్చేసరికి వంటింట్లోంచి పచ్చి వడియాల అట్టు వాసన ఘుమఘుమలాడిపోతోంది. ఇంతకన్నా ఎక్సైట్మెంటేంకావాలి ఈ జన్మకి. అంతా వ్రత మహిమ. మరో వారం రోజుల్దాకా భయం లేకుండా కుమ్మేద్దామని డిసైడైపోయాను.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS